సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 27 । జూన్ । 2025



.. ట్రాఫిక్ చిక్కులు

ప్రధాన రహదారులపై ఇసుక లారీలు నిలుపుతుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. 8లో



పోడు వివాదంపై విచారణ

ఇరవెండి ఫారెస్ట్ బీట్‌లో ఇటీవల పోడు సాగుదారులు – అటవీ అధికారుల మధ్య వివాదంపై విచారణ చేపట్టారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 34°/ 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం–జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారికి నివేదన, హారతి సమర్పించిన అర్చకులు మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి, పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

సీల్డ్ కొటేషన్ల ఆహ్వానం

పెద్దమ్మతల్లి ఆలయంలో దసరా ముందు నిర్వహించే శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా వివిధ వస్తువుల సరఫరా, పనుల నిర్వహణకు సీల్డ్ కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ రజనీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి రంగులు, సత్రాలతో పాటు అవసరమైన చోట్ల సునం వేసేందుకు కార్మికుల సరఫరా, రుత్విక్‌ల ఏర్పాటు, వారికి, భక్తులకు వంట చేసేందుకు, సన్నాయి వాయిద్యకారుల ఏర్పాటు, ఆలయం చుట్టూ లైటింగ్, బోర్డుల ఏర్పాటు, పూల అలంకరణ, పూలదండల సరఫరా వంటి పనులు చేసేందుకు ఆసక్తి గలవారు ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటలోపు కార్యాలయం బాక్స్‌లో కోటేషన్లు వేయాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం అందరి సమక్షంలో వాటిని తెరిచి ఖరారు చేయనున్నట్లు ఈఓ తెలిపారు. వివరాలకు 6303408458 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపు సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు

కొత్తగూడెంటౌన్: జిల్లా స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు భద్రాచలంలో శనివారం జరుగుతాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10, 12, 14 ఏళ్ల బాలబాలికలకు 60 మీటర్ల పరుగు పందెం, స్టాండింగ్, బ్రాడ్ జంప్, లాంగ్‌జంప్, కిడ్స్, జావెలిన్‌త్రో తదితర అంశాల్లో ఎంపికలు ఉంటాయని వివరించారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారిని జూలై 6న హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 85220 67157 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

30 లోగా రేషన్ తీసుకోండి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని తెల్ల రేషన్‌కార్డుదారులు ఈనెల 30 లోగా బియ్యం తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రుక్మిణీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు కలిపి ఒకేసారి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రేషన్ దుకాణాలు, డీఆర్ డిపోల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పంపిణీ చేయాలని సూచించారు. ఆయా సమయాల్లో షాపులు తెరవని డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 30 తర్వాత రేషన్ కార్డుదారులు బియ్యం పొందేందుకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

వృత్తి విద్యల్లో రాణించడం అభినందనీయం

పాల్వంచ: వృత్తి విద్యా కోర్సుల్లో మహిళలు రాణించడం అభినందనీయమని నవ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నిఖిల్ దేవినేని, వైస్ ప్రెసిడెంట్ శరత్ బాబు అన్నారు. గురువారం స్థానిక నవ మహిళా సాధికార కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక కార్యక్రమాల్లో భాగంగా తాటి ఆకుల కళాకృతులు, యూనిఫాంలు కుట్టి విక్రయించడం ద్వారా వచ్చిన రూ.2,59,690 నగదును మహిళలకు చెక్కుల రూపంలో అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవ లిమిటెడ్ ఆధ్వర్యంలో పలు రకాల వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టి స్థానిక యువత, మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎంజీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదంటూ గతేడాది జూన్‌లో కాంగ్రెస్ సర్కార్ బీఆర్‌ఎస్‌పై ఘాటైన విమర్శ చేసింది. ముందుచూపుతో నిర్మించే రాజీవ్ కెనాల్ ద్వారా నాగార్జున సాగర్ ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు జిల్లాలో కనీసం 60వేల ఎకరాల కొత్త ఆయకట్టును ఏడాదిలోగా అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది. అయితే ఆ హామీ మాత్రం నెరవేరలేదు. ఇప్పుడు ఇదే అంశంపై సీతారామ పంపుహౌస్‌ల వద్ద ఈనెల 30న పిండప్రదాన కార్యక్రమాలకు ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పిలుపునిచ్చింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

సీతారామ పంప్‌హౌస్ -2 మోటార్లను ఆన్ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి, తుమ్మల తదితరులు (ఫైల్)



ఏదీ ఆనాటి హడావిడి?

సీతారామపై గతేడాది ముగ్గురు మంత్రుల ఫోకస్

- జిల్లాలో 60 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు హామీ
- ఏడాది గడిచినా టెండర్ల దశ దాటని 'డిస్ట్రిబ్యూటరీ'
- ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆందోళన బాట

తట్టెడు మట్టి ఎత్తలేదు

సీతారామ పనుల్లో ఆగస్టు 15 వరకు కనిపించిన ఊపు ఆ తర్వాత కూడా కొనసాగి ఉంటే 1, 2 ప్యాకేజీల కింద కొంతైనా డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల పనులు జరిగి కొత్త ఆయకట్టు అందుబాటులోకి వచ్చేది. ప్రభుత్వం చెప్పినట్టు 60 వేల ఎకరాలు కాకపోయినా కనీసం ఆరు వేల ఎకరాలకైనా నీరందేది. కానీ డిస్ట్రిబ్యూటరీ పనులకు సంబంధించి తట్టెడు మట్టి కూడా ఎత్తకపోవడం గమనార్హం.

గట్టి హామీలిచ్చినా..

గతేడాది పార్లమెంట్ ఎన్నికల హడావుడి ముగిసిన వెంటనే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంయుక్తంగా సీతారామా ప్రాజెక్టు పనులపై దృష్టి పెట్టారు. ప్రాజెక్టు బ్యారేజ్, పంప్‌హౌస్, ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణ పనులను గతేడాది జూన్ 13న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు సర్కారు తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని ప్రకటించారు. మంత్రుల సమష్టి కృషి ఫలించి గతేడాది ఆగస్టు 15న మూడు పంప్‌హౌస్‌లతో పాటు రాజీవ్ కెనాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి జాతికి అంకితం చేశారు. ఇదే ఊపులో జిల్లా పరిధిలో 1,49,952 ఎకరాల కొత్త ఆయకట్టును అందుబాటులోకి తెచ్చేలా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ముందుగా పెట్టుకున్న టార్గెట్ ప్రకారం ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నాటికి కనీసం 60 వేల ఎకరాల కొత్త ఆయకట్టు జిల్లాలో అందుబాటులోకి రావాల్సి ఉంది.

కనిపించని కొత్త ఆయకట్టు

డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులను 1, 2, 7, 8 ప్యాకేజీలుగా విభజించారు. అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాలకు సంబంధించి యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తయితే 7, 8 ప్యాకేజీల కింద నిర్మించే డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లలో నీరు పారే అవకాశం ఉంది. యాతాలకుంట టన్నెల్ పొడవు 1.8 కి.మీ. ఉండగా ఇప్పటి వరకు 1.2 కి.మీ. మేర పనులు పూర్తయ్యాయి. ఇంకా 600 మీటర్లు నిర్మించాల్సి ఉంది. దీంతో ఈ సీజన్‌లో కూడా సత్తుపల్లి, అశ్వారావుపేటకు గోదావరి జలాలు వచ్చే పరిస్థితి లేదు. మరోవైపు 1, 2 ప్యాకేజీల కింద డిస్ట్రిబ్యూటరీ పనులు జరిగితే జిల్లాలో 60 వేల ఎకరాలకు గోదావరి నీరు అందే అవకాశం ఉంది.

నాలుగింట ఒక్కటి..

1, 2 ప్యాకేజీలకు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణ పనులకు గత ఆగస్టు చివరలో ఆమోదం వస్తే అక్టోబర్‌లో టెండర్లు పిలిచారు. వాయిదాల మీద వాయిదాలు వేస్తూ టెండర్ల ప్రక్రియను 2025 జనవరి వరకు కానిచ్చారు. ఇటీవల ఒకటో ప్యాకేజీకి సంబంధించిన అగ్రిమెంట్ పూర్తయింది. రెండో ప్యాకేజీ ఇంకా టెండర్ల దశలోనే మగ్గుతోంది. 7, 8 ప్యాకేజీలు కమీషన్ ఆఫ్ టెండర్స్ (సీఓటీ) గడప దాటలేదు. మొత్తంగా ఏడాది పూర్తయినా జిల్లాలో కనీసం ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదు.

డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ప్యాకేజీలు

ప్యాకేజీ	కొత్త ఆయకట్టు (ఎకరాల్లో)	నిర్మాణ వ్యయం (రూ.కోట్లలో)	లబ్ధిపొందే నియోజకవర్గాలు
1	41,813	523	పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట
2	36,231	262	కొత్తగూడెం, వైరా, అశ్వారావుపేట
7	63,310	521	అశ్వారావుపేట
8	38,598	467	అశ్వారావుపేట, సత్తుపల్లి

ఏసీబీ దాడులతో బెంబేలు

- బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు
- అక్రమాలు జరిగినట్లు గుర్తించిన అధికారులు



సబ్ రిజిస్ట్రార్‌ను ప్రశ్నిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమేష్

బూర్గంపాడు: జిల్లాలో ఏసీబీ వరుస దాడులు, సోదాలు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ దాడుల్లో కొందరు ఉద్యోగులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడుతుండగా మరికొందరు తృటిలో తప్పించుకుంటున్నారు. జిల్లాలో ఇటవల వరుసగా ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్న క్రమంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు, ఉద్యోగులు వారం, పది రోజుల పాటు జాగ్రత్తగా ఉంటున్నా.. ఆ తర్వాత 'మామూలు'గానే తమ పని కానిచ్చేస్తున్నారు. ఈ నెల 21న బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్ట్ క్రాంతి కొత్త రేషన్‌కార్డు ప్రాసెస్ చేసేందుకు రూ. 2,500 లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఈ ఘటన జరిగిన ఐదురోజులకే గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక సోదాలు చేపట్టారు. రికార్డులు, కంప్యూటర్ డేటా, భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీల పత్రాలను, వివాహ రిజిస్ట్రేషన్ పత్రాలు, ల్యాండ్ కన్వర్షన్ తదితర ఫైళ్లను తనిఖీ చేశారు. కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల ప్రమేయంపై సబ్ రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. సోదాల సమయంలో కార్యాలయంలో ఉన్న ప్రైవేటు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకుని విచారించారు. కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై ఇటీవల చాలా ఫిర్యాదులందాయని, ఈ క్రమంలోనే ఆకస్మిక సోదాలు నిర్వహిస్తున్నామని ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. అవినీతి, అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామని డీఎస్పీ తెలిపారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా నగదు చెల్లింపులకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు కూడా నిర్ధారణకు వచ్చామన్నారు. సోదాలు పూర్తిస్థాయిలో కొనసాగించాక బాధ్యులపై శాఖాపరమైన చర్యల కోసం ఏసీబీ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఏ ప్రభుత్వ అధికారైనా, ఉద్యోగైనా లంచం అడిగితే ఏసీబీకి సమాచారం అందించాలని కోరారు. ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064 లేదా 9154388981 నంబర్లకు ఎప్పుడైనా ఫోన్ చేయవచ్చని సూచించారు.

ఉత్పత్తి వ్యయం తగ్గించాలి

- యంత్రసామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలి
- సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు



ఓసీ-2 కోల్ బెంచ్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ గౌతమ్ పొట్రు, అధికారులు

మణుగూరు టౌన్: యంత్ర సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని, శ్రమశక్తిని ఉపయోగించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలని సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు సూచించారు. సింగరేణి మణుగూరు ఏరియాలో గురువారం పర్యటించిన ఆయన పీకేఓసీ గనులు, కోల్ బెంచ్‌ను పరిశీలించాక యంత్రాల పనితీరుపై ఆరాతీశారు. అలాగే, వ్యూ పాయింట్ నుంచి డ్రిల్ మిషన్లు, షావెల్స్, బొగ్గు లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం గౌతమ్ మాట్లాడుతూ వినియోగదారులు కోరిన విధంగా నాణ్యమైన బొగ్గు సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అధికారులతో సమావేశమై మాట్లాడుతూ.. నిర్దేశిత 8 గంటల పనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ప్రతి ఉద్యోగి, రక్షణతో కూడిన ఉత్పత్తికి పాటుపడేలా చూడాలని, సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం సింగరేణి ఆస్పత్రి సౌకర్యాలు, మణుగూరు ఓసీ భూ సేకరణ అనుమతుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్, అధికారులు శ్రీనివాస్, శ్రీనివాసాచారి, చంద్రశేఖర్, వెంకట్‌రావు, రమేశ్, అనురాధ, వీరభద్రుడు, సురేశ్‌కుమార్, రమణరెడ్డి, నాగరమేశ్, ఎస్ఓటూ డైరెక్టర్ సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఏరియా ఆస్పత్రిలో వైద్యుల నియామకం, ఉద్యోగులకు 250 గజాల స్థలం కేటాయింపు, గణతంత్ర, స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు నిధుల పెంపు, అన్ని ఓసీల్లో భోజనం సౌకర్యం కల్పించడమే కాక ఫ్లైడేలలో ఎస్-1, పీహెచ్‌డీలో పీ2 సర్క్యులర్ రద్దు, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు తదితర అంశాలపై ఐఎన్‌టీయూసీ నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, గట్టయ్య, షాబుద్దీన్ తదితరులు డైరెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు.

రామయ్యకు కాసుల పంట



చిత్రకూట మండపంలో నగదును లెక్కిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

50 రోజుల హుండీ ఆదాయం రూ.1.97 కోట్లు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి కాసుల పంట పండింది. చిత్రకూట మండపంలో గురువారం ఆలయ హుండీలను లెక్కించగా రూ.1,97,79,049తో పాటు 65 గ్రాముల బంగారం, 1.5 కేజీల వెండి, విదేశీ ద్రవ్యం లభించాయని ఈఓ రమాదేవి తెలిపారు. గత మే 6న చివరిసారి హుండీలు లెక్కించారు. ఇప్పుడు 50 రోజుల్లో రూ.2 కోట్లకు దగ్గరగా ఆదాయం సమకూరడం విశేషం. వేసవి సెలవుల నేపథ్యంలో మే, జూన్ నెలల్లో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదాయం భారీగా రావడంతో ఆలయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. హుండీ లెక్కింపు అనంతరం నగదును బ్యాంకు అధికారులకు అందజేశారు.

సీహెచ్‌సీలో వైద్యుల నియామకం

సాక్షి ఎఫెక్ట్..

బూర్గంపాడు: ఎట్టకేలకు బూర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో ముగ్గురు వైద్యులను నియమించారు. 'సీహెచ్‌సీనా.. డెంటల్ ఆస్పత్రా!' శీర్షికన ఈనెల 11న సాక్షిలో ప్రచురితమైన కథనానికి వైద్యా విధాన పరిషత్ అధికారులు స్పందించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు డీసీహెచ్‌ఎస్ రవిబాబు.. సీహెచ్‌సీలో ముగ్గురు వైద్యులను నియమించారు. వీరిలో ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లు కాగా, ఒకరు గైనకాలజిస్ట్ ఉన్నారు. కాగా, ఈ ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలని పలుమార్లు కలెక్టర్ ఆదేశించినా గైనకాలజిస్ట్ లేక డెలివరీలు చేయడం లేదు. ఎట్టకేలకు గైనకాలజిస్ట్ నియామకంతో ప్రసవాలు పెరిగే అవకాశాలున్నాయి. గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావణి విధుల్లో చేరిన తొలిరోజే ఓ గర్భిణికి సుఖప్రసవం చేయడం విశేషం.

మాతృమరణాల నివారణకు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్, పక్కన ట్రైనీ కలెక్టర్ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఎక్కడా మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. వైద్యాధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి దురదృష్టకర ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మెరుగైన ఆరోగ్య సంరక్షణ పద్ధతులు అవలంబించాలని, గర్భిణులు ఇళ్లలో మునగ చెట్లు నాటేలా ప్రోత్సహించాలని సూచించారు. మునగలో ఉండే అధిక పోషక విలువలు, వ్యాధుల నివారణకు ఎలా ఉపకరిస్తుందనే విషయాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలను కాలానుగుణంగా పర్యవేక్షించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు అర్హత కలిగిన సిబ్బందిని మాత్రమే నియమించాలని, ఈ మేరకు తనిఖీలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, డీఎంహెచ్‌ఓ భాస్కర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, డీఎస్పీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి



బెలూన్లు ఎగరేసి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

- మత్తు నుంచి విముక్తికి సైనికుల్లా పోరాడుదాం
- గంజాయి రహిత జిల్లాగా మారుద్దాం
- కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే పిలుపు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రిని డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని, అందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పోరాడాలని, ఆ మహమ్మారిని తరిమికొట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ నుంచి కొత్తగూడెం క్లబ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగంతో అనేక దుష్ఫలితాలు కలుగుతాయన్నారు. గంజాయి, డ్రగ్స్ బారిన పడుతున్న యువత తమ అమూల్యమైన జీవితాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అంతకుముందు డ్రగ్స్ వినియోగించబోమంటూ యువతతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, కరమ్‌చంద్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, సీఐలు ఎం.కరుణాకర్, శివప్రసాద్, ప్రతాప్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన 18 ఏళ్ల పోరాటం!

- కారుణ్య నియామకం సాధించిన దివ్యాంగుడు
- తొలి ప్రజాదర్బార్‌లో దరఖాస్తుతో పీఆర్ శాఖలో ఉద్యోగం



నియామక పత్రం అందుకుంటున్న రామకృష్ణ

అశ్వారావుపేటరూరల్: ఓ దివ్యాంగుడు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందేందుకు ఏకంగా 18 ఏళ్ల పాటు పోరాడాడు. ఎట్టకేలకు ఆయన పోరాటం ఫలించగా ఇటీవల నియామకపత్రం అందుకున్నాడు. కొత్తగూడెం విద్యానగర్‌కాలనీకి చెందిన కర్నాటి నాగేశ్వరరావు పంచాయతీరాజ్ శాఖలో గ్యాంగ్ మజ్దూర్‌గా ఉద్యోగం చేస్తూ 2007లో గుండెపోటుతో మృతి చెందాడు. ఆ తర్వాత ఆయన కుమారుడు దివ్యాంగుడైన రామకృష్ణ కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో 2017లో హైకోర్టును ఆశ్రయించాడు. న్యాయస్థానం కూడా రామకృష్ణకు ఉద్యోగం ఇవ్వాలని తీర్పు ఇచ్చినా ఫలితం కానరాలేదు.

ప్రజాదర్బార్‌లో వినతితో కదలిక..

న్యాయస్థానంలో పోరాడుతూనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలిసారి 2023 డిసెంబర్ 10వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో రామకృష్ణ పాల్గొని మంత్రి సీతక్కకు దరఖాస్తు ఇచ్చాడు. దీంతో ఉన్నతాధికారులకు పంపించగా.. ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్‌కుమార్ పరిశీలించి ఈనెల 23వ తేదీన రామకృష్ణను ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం పీఆర్ ఎస్‌ఈ వెంకటరెడ్డికి ఈ ఉత్తర్వులు అందగా అశ్వారావుపేట పీఆర్ కార్యాలయంలో రామకృష్ణకు పోస్టింగ్ ఇచ్చారు. ఆ తర్వాత డిప్యూటేషన్‌పై కొత్తగూడెం పంచాయతీరాజ్ కార్యాలయంలో గురువారం ఆయన విధుల్లో చేరాడు.

సౌర విద్యుత్‌తో ఆదాయం

సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు

సింగరేణి(కొత్తగూడెం): సౌర విద్యుదుత్పత్తితో సంస్థకు ఆదాయం చేకూరుతోందని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం)సత్యనారాయణరావు తెలిపారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరంలో ఉన్న 10.5 మెగావాట్ల సోలార్ మోడల్ హౌస్‌ను గురువారం ఆయన ఇతర డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, ఏరియా జీఎం శాలెంరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 224 మెగావాట్ల సోలార్ ప్లాంట్లలో సుమారు 900 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. త్వరలో మరో 76 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న సోలార్ విభాగం జీఎం జి.జానకి రామయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, గుర్తింపు సంఘం నాయకుడు గట్టయ్య, అధికారులు పీజులార్డ్, సూర్యనారాయణరాజు, శ్రీకాంత్, బి.శంకర్, అనిల్, ఉపేందర్‌బాబు, సత్తార్‌పాష, కార్మిక నాయకులు సాగర్, మధుకృష్ణ, సీతారామరాజు, జి. వీరాస్వామి, రాములు, శ్రీనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు

క్లుప్తంగా

మత్తుకు బానిసలు కావొద్దు

భద్రాచలంఅర్బన్: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సూచించారు. పట్టణంలో బుధవారం అర్ధరాత్రి, గురువారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వారికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించి, హెచ్చరించి వదిలేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు యువకులు గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై సామాన్య ప్రజలను ఇబ్బందులు కలిగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. దీంతో అనుమానిత ప్రాంతాలు, గంజాయి హాట్ స్పాట్లలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. భద్రాచలం మీదుగా ఇతర ప్రాంతాలకు నిషేధిత పదార్థాలు తరలివెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

కొత్తగూడెంటౌన్: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశానికి ఎంపికలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా మండలస్థాయిలో ఎంపికైన 124 మంది బాలబాలికలకు తొమ్మిది రకాలు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన 10 మంది బాలికలు, 10 మంది బాలురను ఎంపిక చేశారు. వీరిని జూలై 2 నుంచి జరిగే రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపుతారు. రాష్ట్రస్థాయిలో అర్హత సాధించినవారికి హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రాంతాల్లోని స్పోర్ట్స్ పాఠశాలల్లో అడ్మిషన్లు ఇస్తారని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి తెలిపారు. ఎస్‌జీఎఫ్ నుంచి నరేష్, పీడీలు, పీఈటీలు, స్పోర్ట్స్ కార్యాలయం నుంచి తిరుమలరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆఫ్‌టైప్ మొక్కలపై విచారణ



ఆఫ్‌టైప్ మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అశ్వారావుపేట: ఆయిల్‌ఫెడ్ నర్సరీల నుంచి సరఫరా అయిన మొక్కల్లో ఆఫ్‌టైప్ రావడంతో నష్టపోయినట్లు పలువురు రైతులు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ ఇటీవల హైదరాబాద్‌లో అధికారులు, రైతులతో సమావేశమై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈమేరకు అశ్వారావుపేట మండలంలోని పలువురి తోటలను ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. మండలానికి చెందిన నున్నా కృష్ణ, కుంచం సుబ్బారావు తోటలను పరిశీలించిన వారు ఆఫ్‌టైప్, సాధారణ మొక్కల ఎదుగుదల, దిగుబడిపై అధ్యయనం చేశారు. ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తలు ఎం వీ.ప్రసాద్, రామచంద్రుడు, బి.కళ్యాణ్, ఆయిల్‌ఫెడ్ ఓఎస్‌డీ ఏ కిరణ్, జిల్లా ఇన్‌చార్జ్ రాధాకృష్ణ, అశ్వారావుపేట, దమ్మపేట హెచ్‌ఓలు వేణుమాధవ్, సందీప్, హెచ్‌ఆర్‌ఎస్ సైంటిస్ట్ విజయకృష్ణ, ఆయిల్‌ఫాం గ్రోయర్స్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు తుంబూరు మహేశ్వర రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య పాల్గొన్నారు.

డీఐఈఓకు ప్రశంసలు



డీఐఈఓను అభినందిస్తున్న విద్యాశాఖ కమిషనర్

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యావిధాన పర్యవేక్షణ, కళాశాలల మెరుగైన నిర్వహణ, ఉత్తీర్ణతా శాతం పెంపునకు కృషి చేసినందుకు డీఐఈఓ హుసవత్ వెంకటేశ్వరరావును ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ కృష్ణ ఆదిత్య ప్రశంసించారు. గురువారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల డీఐఈఓ, ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చేసిన కృషిని అభినందించారని వెంకటేశ్వరరావు తెలిపారు.

ముద్దాయిలకు రెండేళ్ల జైలుశిక్ష

బూర్గంపాడు: బూర్గంపాడులో 2021 ఏప్రిల్ 12న వంగపూడి నాగమణి ఇంట్లో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులకు భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శివనాయక్ రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. నాగమణి ఇంట్లో రూ 10.లక్షల విలువైన బంగారం, నగదు చోరీ జరిగింది. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టిన సారపాకకు చెందిన కునమళ్ల సందీప్, బూర్గంపాడుకు చెందిన పుట్టి నవీన్‌లపై కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను విచారించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఇసుక లారీలతో ట్రాఫిక్ చిక్కులు

- చర్ల–వెంకటాపురం మార్గంలో రెండు చోట్ల స్తంభించిన రాకపోకలు
- ట్రాఫిక్‌లో నిలిచిన గర్భిణిని ఆస్పత్రికి తరలించే అంబులెన్స్



సీ కత్తిగూడెం వద్ద ప్రధాన రహదారిపై నిలిపిన లారీలు

చర్ల: ప్రధాన రహదారులపై ఇసుక లారీలు నిలుపుతుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నెల రోజులుగా ఇదే తంతు కొనసాగుతున్నా ఇసుక క్వారీల నిర్వాహకులు, అధికారులు పట్టించుకోకపోవడంలేదు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించే వారి పట్ల క్వారీల నిర్వాహకులు దురుసుగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. తాజాగా గురువారం సాయంత్రం చర్ల–వెంకటాపురం మార్గంలో సీ కత్తిగూడెం వద్ద ప్రధాన రహదారిపై రెండువైపులా అధిక సంఖ్యలో ఇసుక లారీలను నిలిపారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సుమారు రెండున్నర గంటల పాటు ఈ ప్రాంతంలో వాహనాలు నిలిచిపోగా ఈ ట్రాఫిక్‌లో ఓ గర్భిణిని వెంకటాపురం వైపు నుంచి భద్రాచలం వైపు తరలిస్తున్న అంబులెన్సు కూడా ఇరుక్కుపోయింది. చర్ల సీఐ రాజువర్మ, ఎస్‌ఐ కేశవ్ అక్కడకు చేరుకుని అతికష్టం మీద ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. గురువారం రాత్రి కూడా ఇదే మార్గంలోని సుబ్బంపేటలో ప్రధాన రహదారిపై ఇసుక లారీలు నిలపడంతో కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అక్కడికి కూడా పోలీసులు వెళ్లి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రధాన రహదారిపై ఇసుక లారీలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

ఐదో సెమిస్టర్‌లో 50.56, ఆరో సెమిస్టర్‌లో 50.16శాతం ఉత్తీర్ణత



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన డిగ్రీ ఐదు, ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేశారు. కేయూ క్యాంపస్‌లో వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం, పరీక్షల విభాగం అధికారులతో కలిసి ఫలితాలను విడుదల చేయగా పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ వివరాలు వెల్లడించారు. ఐదో సెమిస్టర్ పరీక్షలకు 13,963 మంది విద్యార్థులు హాజరుకాగా, 7,059 మంది (50.56శాతం) ఉత్తీర్ణులయ్యారని, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో 37,999మందికి 19,060 (50.16శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. కాగా, ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశముందని అధికారులు తెలిపారు. పదిహేను రోజుల్లోగా ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

నిరుపయోగ వస్తువుల వేలం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా పోలీసు శాఖలోని వివిధ విభాగాలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న వస్తువులను గురువారం హేమచంద్రాపురంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బహిరంగ వేలంపాటలో విక్రయించారు. కంప్యూటర్ మానిటర్లు, సీపీయూలు, కీబోర్డులు, మౌస్‌లు, ట్యాబ్‌లు, యాపిల్ ఐ ప్యాడ్‌లు, ఇన్వర్టర్, ఇన్వర్టర్ బ్యాటరీలు, డ్రాగన్ లైట్లు, టార్చ్ లైట్లు, క్లాత్ టెంట్లు, టేబుళ్లు, కుర్చీలు, బీరువాలతో పాటు ఇతర ఫర్నిచర్ సామగ్రి, ఇతర వస్తువులకు వేలంపాట నిర్వహించారు. పోలీస్ శాఖ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి వేలం నిర్వహించగా, అన్ని వస్తువులను రూ.3,07,100 పాటదారులు చేజిక్కించుకున్నారని పోలీస్ అధికారులు తెలిపారు.

ఉద్యోగిని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఓ ఉద్యోగిని చంపుతానని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై యయాతిరాజు కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం వేగవరానికి చెందిన పోస్టు మాస్టర్ బుర్రి ముకుందర్ ఈ నెల 25న ఉదయం అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని బైక్ స్టాండ్‌లో తన ద్విచక్రవాహనం పార్క్ చేసి ఖమ్మం ఆస్పత్రికి వెళ్లాడు. తిరిగి అదే రోజు అర్ధరాత్రి 12గంటలకు వచ్చిన ఆయన తన బైక్ తీసుకెళ్లేందుకు స్టాండ్ గేట్ తీయాలని కోరగా.. అర్ధరాత్రి ఎందుకు వచ్చావంటూ ప్రేమ్ అనే వ్యక్తి దుర్భాషలాడాడు. అక్కడి నుంచి బయటకు నెట్టి చంపుతానని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదుతో ప్రేమ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన ఎమర్జెన్సీ

మాజీ ఎంపీ సీతారాం నాయక్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాం నాయక్

ఇల్లెందు: ఎమర్జెన్సీ రాజ్యాంగాన్ని ఖూనీ చేసిందని మాజీ ఎంపీ, బీజేపీ నేత ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. గురువారం ఆయన ఇల్లెందులో విలేకరులతో మాట్లాడారు. ఎమర్జెన్సీ చీకటి రోజులకు 50 ఏళ్లు నిండిందని, నాటి చీకటి రోజుల్లో ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారని అన్నారు. ఈ ప్రాంతంలో ఎంపీలు ఒక్క ప్రాజెక్ట్ కూడా తీసుకురాలేక పోయారని విమర్శించారు. సీతారామ ప్రాజెక్ట్, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, జాతీయ రహదారులకు అతీగతీ లేదని అన్నారు. కాళేశ్వరం కమీషన్, ఫోన్ ట్యాపింగ్, ఈ–రేస్ అంటూ సీరియల్స్ నడపటం తప్ప కేసీఆర్‌ను అరెస్ట్ చేసే దమ్ము సీఎం రేవంత్‌కు లేదన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నాయకులు గోపీకృష్ణ, సుచిత్ర ఉన్నారు.

గంజాయి కేసులో అక్రమంగా ఇరికించారు..

విలేకరుల సమావేశంలో ఓ మహిళ ఆవేదన

పాల్వంచ: గంజాయి కేసులో తన ఇద్దరు కుమారులను అక్రమంగా ఇరికించారని పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన జుబేదా అనే మహిళ ఆరోపించింది. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత సోమవారం ఉదయం పట్టణ ఎస్‌ఐ సుమన్ కానిస్టేబుల్‌ను పంపించి ఏదో ఫోన్ విషయం మాట్లాడాలని తమ పిల్లలు వసీం, సమీర్‌లను తీసుకెళ్లారని తెలిపింది. పిల్లలను చితక బాదడంతో తలపగిలిందని, కడుపులో పిడిగుద్దులు గుద్దారని ఆవేదన వ్యక్తం చేసింది. కిన్నెరసాని అడవుల్లోకి తీసుకెళ్లి గంజాయి ముందు పెట్టి ఒప్పుకోకపోతే ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించారని, తీసుకెళ్లిన మూడు రోజుల తర్వాత రిమాండ్ చేసి జడ్జి ముందు ప్రవేశపెట్టారని తెలిపింది. అక్కడ తమ కొడుకులను కొట్టిన విషయం, బెదిరించిన విషయం వాంగ్మూలం ఇచ్చామని పేర్కొంది. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరింది. కాగా ఈ విషయమై ఎస్‌ఐ సుమన్‌ను వివరణ కోరగా.. ఆధారాలతోనే అరెస్ట్ చేశామని, తప్పు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బూతులు తిడుతున్నాడు.. మాకొద్దీ విద్యార్థి

మైనార్టీ గురుకులానికి రావొద్దని తేల్చిచెప్పిన అధికారులు

పాల్వంచ: పాఠశాలలో బూతులు మాట్లాడుతున్నాడంటూ ఓ విద్యార్థిని బడికి రావొద్దని ఇంటికి పంపించిన ఘటన పాల్వంచలోని శేఖరం బంజర మైనార్టీ గురుకులంలో చోటుచేసుకుంది. పాల్వంచకు చెందిన ఓ విద్యార్థి గతేడాది ఐదో తరగతిలో గురుకులంలో చేరాడు. కొన్ని రోజుల తర్వాత ఆ పిల్లవాడు తరచూ బూతులు తిడుతున్నాడంటూ తోటి విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విద్యాసంవత్సరం ఆరో తరగతిలో చేరేందుకు రాగా ప్రిన్సిపాల్ రాంబాబు అనుమతించ లేదు. తిరిగి ఇంటికి వెళ్లిన విద్యార్థి.. తన తల్లి, నానమ్మతో కలిసి గురువారం తిరిగి పాఠశాలకు వచ్చాడు. అయినా ప్రిన్సిపాల్ ససేమిరా అనడంతో.. చిన్నప్పుడే తండ్రి చనిపోయాడని, పిల్లవాడు కొంత ఇబ్బంది పెట్టేది నిజమేనైనా ఉపాధ్యాయులే గాడిలో పెట్టాలని వారు కోరారు. ఎంత బతిమిలాడినా ప్రిన్సిపాల్ అంగీకరించకపోవడంతో జిల్లా మైనార్టీ అధికారి సంజీవరావు, గురుకులాల ఆర్‌ఎల్‌సీ అరుణకుమారిని కలిసి విషయం చెప్పారు. దీంతో వారు విద్యార్థిని తీసుకుని పాఠశాలకు వెళ్లి ఆరా తీయగా.. విద్యార్థిపై ఫిర్యాదులు వచ్చాయని తెలుసుకుని తామేమీ చేయలేమంటూ వెళ్లిపోయారు. ఈ విషయమై సంజీవరావును వివరణ కోరగా విద్యార్థిలో క్రమశిక్షణ లేదని, తోటి పిల్లలను ఇబ్బంది పెడుతున్నాడంటూ ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి పరిస్థితుల్లో తామేమీ చేయలేమని అన్నారు.

అదుపు తప్పి బీభత్సం సృష్టించిన కారు

దమ్మపేట: అతివేగంతో వస్తున్న కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించిన ఘటన దమ్మపేట రహదారిపై వాటర్ ట్యాంకు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... దమ్మపేట గ్రామం నెమలిపేట నుంచి అదే కాలనీకి చెందిన యువకుడు కారును డ్రైవింగ్ చేస్తూ దమ్మపేట ప్రధాన సెంటర్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో అతివేగంగా వస్తున్న కారు అదుపు తప్పి డీసీసీ బ్యాంకు సమీపంలో డివైడర్ ఎక్కి అవతలి వైపు దూసుకెళ్లింది. అనంతరం ఓ బైక్ మెకానిక్ గ్యారేజ్ ముందు పార్క్ చేసిన నాలుగు బైక్‌లను ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కారు ముందు భాగం కూడా దెబ్బతిన్నది. కారు డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. రోడ్డుపైన ఉన్న వారికి ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఫార్చునర్ కారులో గంజాయి రవాణా!

- 21.5 కేజీలు స్వాధీనం
- ఐదుగురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మణుగూరు టౌన్: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు ఫార్చునర్ కారులో తరలిస్తున్న గంజాయిని మణుగూరులో ఎక్సైజ్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు సుంకర రమేష్, రాజిరెడ్డి కథనం ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన షేక్ సమీర్, సయ్యద్ అబూబకర్, ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచకు చెందిన తానంకి ప్రవీణ్, కోట హరీశ్, యశ్వంత్‌కుమార్‌లు గంజాయికి అలవాటుపడి స్నేహితులుగా మారారు. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌లోని పాతబస్తీకి కారులో 21.5 కేజీల గంజాయి తరలిస్తున్నారు. ఈ క్రమంలో మణుగూరులోని రథంగుట్ట అర్బన్ పార్క్ వద్ద ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. గంజాయితోపాటు కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 13 లక్షలు ఉంటుందని, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని అధికారులు తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న హైదరాబాద్‌కు చెందిన షేక్ ఫైసల్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు.

వేటగాళ్లు అరెస్ట్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : గేదెల మృతికి కారణమైన ఇద్దరు వేటగాళ్లను అరెస్టు చేసినట్లు జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి గురువారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మండలంలోని వెంకటాపురం గ్రామ రైతు మడి మురళికి చెందిన ఎనిమిది గేదెలు ఈ నెల 15న మేతకు వెళ్లి అటవీప్రాంతంలో వన్య ప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి మృత్యువాత పడ్డాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తీగలు అమర్చిన పెంట్లం గ్రామానికి చెందిన తాటి నాగేంద్రబాబు, తాటి నాగరాజులను అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ చంద్రశేఖర్, కానిస్టేబుల్ ఎం. శ్రీనివాసరావును డీఎస్పీ ఎస్కే అబ్దుల్ రెహమాన్ అభినందించారు.

జడ్జి ఎదుట నిందితుడి లొంగుబాటు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీలో ఈ నెల 7న జరిగిన కనితి సతీష్ హత్య కేసులో మరో నిందితుడు అశోక్ గురువారం భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ ఎదుట లొంగిపోయాడు. కాగా ఇప్పటికే ఈ కేసులో భద్రాచలం పోలీసులు 19 మందిని అరెస్ట్ చేశారు. కేసులో ఏ–2గా ఉన్న జగదీష్ కాలనీకి చెందిన అశోక్ గురువారం లొంగిపోగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

దాడి ఘటనలో కేసు

ఇల్లెందు: బావపై బావమరుదుల దాడి ఘటనలో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని 15 నంబర్ బస్తీకి చెందిన శివ లోథ్, ప్రీతి లోథ్ దంపతుల మధ్య మనస్పర్థలు రాగా భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో 25వ తేదీ రాత్రి తన భార్య కోసం వెళ్లిన శివ లోథ్‌ను బావమరుదులు నాగేందర్, రవీందర్ కొట్టి గాయపర్చారు. బాధితుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస రెడ్డి తెలిపారు.

పోడు వివాదంపై ఆర్డీఓ విచారణ



కొసగుంపు గ్రామస్తులను విచారిస్తున్న ఆర్డీఓ దామోదర్‌రావు

బూర్గంపాడు: ఇరవెండి ఫారెస్ట్ బీట్‌లోని వలస ఆదివాసీ గ్రామమైన కొసగుంపులో ఇటీవల పోడు సాగుదారులైన మహిళలకు, అటవీశాఖ అధికారులకు మధ్య జరిగిన వివాదంపై భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు గురువారం విచారణ చేపట్టారు. పోడు భూములకు కందకాలు తీసేందుకు జేసీబీతో వచ్చిన అటవీశాఖ అధికారులను కొసగుంపు మహిళలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. తమ విధులకు ఆటంకం కలిగించారని అటవీశాఖ అధికారులు, మహిళలని చూడకుండా తమపై దాడులకు పాల్పడ్డారని కొసగుంపు మహిళలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ వ్యవహారం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశమైంది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖలు ఈ ఘటనపై స్పందించారు. ఈ క్రమంలో ఆర్డీఓ దామోదర్‌రావు గ్రామానికి వచ్చి ఆదివాసీ మహిళలతో మాట్లాడారు. అటవీశాఖ అధికారుల వాదనలు కూడా విన్నారు. గ్రామంలోని 34 ఆదివాసీ కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి మూడెకరాల చొప్పున ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలిప్పించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలిస్తామని ఆర్డీఓ తెలిపారు. మిగతా అటవీభూములలోకి వెళ్లవద్దని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, అశ్వాపురం రేంజ్ ఆఫీసర్ రమేష్, ఐటీడీఏ ఏఓ రాంబాబు, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భజన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇస్తాం.. ఉపాధి కల్పిస్తాం

మణుగూరు ఓసీ విస్తరణ గ్రామసభలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ

మణుగూరు టౌన్: మణుగూరు ఓసీ విస్తరణ నిర్వాసితులకు ఎకరానికి రూ.22.5 లక్షలు నష్టపరిహారం అందిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ తెలిపారు. గురువారం పట్టణంలోని కొమ్ముగూడెం కమ్యూనిటీ హాల్‌లో గ్రామపెద్ద కంగాల భిక్షం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.5.5 లక్షలు, ప్రభుత్వ భూమిలోని గిరిజనులకు పూర్తి పరిహారం, గిరిజనేతరులకు రూ.11.25 లక్షలు అందిస్తామని తెలిపారు. నిర్వాసిత నిరుద్యోగులకు కనీస వేతనం తగ్గకుండా స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇచ్చి, ఓసీల్లో ఉపాధి అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కోల్పోతున్న భూముల్లో చెట్లు, బోరు, బావి, కట్టడాలు ఉంటే సంబంధిత అధికారుల వాల్యుయేషన్ తెప్పించి అదనంగా ప్రయోజనం చేకూరుస్తామని వివరించారు. చెరువుపై ఆధారపడిన అర్హులైన మత్స్యకారులకు రూ.5.5 లక్షల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందిస్తామని తెలిపారు. దీంతో సింగరేణి కాలరీస్ మణుగూరు ఓసీ విస్తరణ కోసం భూ సేకరణకు గ్రామస్తులు సుముఖత వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ టి.ప్రసాద్, తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి



బార్ అసోసియేషన్ అధ్యకుడు లక్కినేనిని సన్మానిస్తున్న అధ్యాపకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతి ఒక్కరూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కలిగి ఉన్నారంటే భారత రాజ్యాంగమే కారణమని, రాజ్యాంగంలోని ఆర్టికల్స్, షెడ్యూళ్లను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో 75 ఇయర్స్ జర్నీ ఆఫ్ ద ఇండియన్ కాన్స్టిట్యూ షన్ ఆఫ్ ఫండమెంటల్ డ్యూటీస్ ఇన్ నేషన్ బిల్డింగ్ అనే అంశంపై గురువారం రాష్ట్రస్థాయి సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. గౌరవ అతిథి మారపాక రమేష్, సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ జీకే కిరణ్‌కుమార్, మేనేజర్ మల్లేశం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద కూడా మాట్లాడారు. అనంతరం అతిథులను సన్మానించారు. అధ్యాపకురాలు జి మేఘన పాల్గొన్నారు.

సింగరేణి కలప స్వాధీనం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని రామటాకీస్ ఆవరణలో సింగరేణికి సంబంధించిన కలప అక్రమంగా నిల్వ చేశారనే సమాచారంతో సంస్థ సెక్యూరిటీ సిబ్బంది గురువారం రాత్రి తనిఖీలు చేశారు. సుమారు రూ. లక్ష విలువైన కలపను స్వాధీనం చేసుకుని సెక్యూరిటీ కార్యాలయానికి తరలించారు. కాగా ఇటీవల సింగరేణి పాత క్వార్టర్లను కూల్చివేశారు. ఆ క్వార్టర్ల కలపనే రామాటాకీస్ ఆవరణలో నిల్వ చేసినట్లు గుర్తించారు. ఈ కలపను ఎవరు అక్కడికి తరలించి, నిల్వ చేశారనేది తేలాల్సి ఉంది.